క్లుప్తంగా

అటెండర్ కోటయ్యకు సేవా చక్రవర్తి అవార్డు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని చీకటీగలపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆవులమంద బాలకోటయ్యకు సేవా చక్రవర్తి అవార్డు లభించింది. బాలకోటయ్య చేసే స్వచ్ఛంద కార్యక్రమాలకు గాను విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. విజయవాడలో జరిగిన అకాడమీ 22వ వార్షికోత్సవంలో కోటయ్యను అకాడమీ అధ్యక్షుడు సీహెచ్ వీఎస్ బ్రహ్మానందరావు, డాక్టర్ సమరం తదితరుల సత్కరించి అవార్డు అందజేశారు. కోటయ్యను పాఠశాల ప్రిన్సిపాల్ జీ.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన కాకుమాను యోగేశ్వరరావు, శైలజ దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం దాత యోగేశ్వరరావు విరాళం మొత్తాన్ని ఈఓ టి.సుధాకర రెడ్డికి అందజేశారు. త్వరలో ప్రారంభించనున్న ఆలయ రాతి నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు. శ్రావణమాస శుక్రవారం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీన ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అమ్మవారి ఆలయానికి వెండి కిరీటం అందజేత



నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి పట్టణానికి చెందిన గొడవర్తి అప్పారావు రెండున్నర కేజీల వెండి కిరీటం బహూకరించారు. ఆలయానికి ఆదివారం కుటుంబ సభ్యులతో వచ్చిన అప్పారావు వెండి కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. గత 50సంవత్సరాలు ఆలయానికి విచ్చేస్తున్న అప్పారావు కుటుంబ సభ్యులు అమ్మవారికి కిరీటం అందించటంపై హర్షం వ్యక్తం చేశారు.

155 మందికి వైద్యపరీక్షలు



యడ్లపాడు: ఆహార, వ్యాయామాల నియమాలతోనే షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యులు తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 155 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలను చేసి రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సంస్థ చైర్మన్ షేక్ జాన్‌సైదా ప్రారంభించారు. గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాల వారు పాల్గొనగా వైద్యులు వివిధ రకాల కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బీవీరెడ్డి, బోయపాలెం రసూల్, పట్నం కరిముల్లా, జిలానీ, కరీం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను తాకిన సూర్యాస్తమయ కిరణాలు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో దుర్గమ్మ అమ్మవారిని ఆదివారం సూర్యాస్తమయ సమయంలో కిరణాలు తాకాయి. శ్రావణ మాసంలో సూర్యాస్తమయ కిరణాలు తాకడం విశేషమని పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతురావు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధితో సువర్ణ పాలన

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గణపవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: సంక్షేమాన్ని అర్హులందరికీ అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందిస్తున్నారని అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు నిర్వహించారు. పద్మశాలీల బజారులో ప్రారంభమై మసీదు సెంటర్ మీదుగా శాంతినగర్ రామాలయం వరకు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అమలవుతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలనలో, సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించిన నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. దీంతో ఆయా వర్గాలకు పాలనలో భాగస్వామ్యం లభించిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా రైతులకు కావాల్సిన ప్రతి పథకాన్ని ఇంటి ముంగిటకే అమలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహన మిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్నివర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలతో గెలుపునందించిన ప్రజలు, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీని అజేయంగా నిలపాలని కోరారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలు నిరంతరం సాగేందుకు ప్రజలు ఆశీస్సులందించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గణపవరం సొసైటీ మాజీ చైర్మన్ కాట్రు రమేష్, కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, పిల్లి సాగర్, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు, శ్రీనివాసరావు, ఎంఎల్‌ఓ విడదల శ్రీనివాసశర్మ, నాదెండ్ల సొసైటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు తలహాఖాన్, మాజీ ఉపసర్పంచ్ గాలి బుచ్చయ్య, కాటా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.సుబ్బారావు, తాళ్లూరి ప్రభుదాసు, మండలనేని వెంకటేశ్వరరావు, దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు షేక్ బాజి, షేక్ రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

విఫల ప్రధాని నరేంద్ర మోదీ

బస్సు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నరసరావుపేట: బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని నరేంద్ర మోదీ ఫెయిల్యూర్ పీఎం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం నరసరావుపేటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే లౌకిక రాజ్యాన్ని కాలరాసి మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి అమలు చేస్తారని అన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో నరేంద్ర మోడీ మతం ఎజెండాగా వెళ్తున్నారని, ఆ పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, చంద్రయాన్ ల్యాండ్ అయిన ప్రాంతానికి నరేంద్రమోదీ శివశక్తిగా నామకరణం చేయటం మతతత్వానికి పరాకాష్ట అన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి

శావల్యాపురం: రీసర్వే పనులు తుది దశకు చేరినట్లు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడు రెవెన్యూ గ్రామాలు ఉండగా మండల భూముల విస్తీర్ణం 36,680 ఎకరాలు ఉందని, అందులో 18,300 ఎకరాల్లో రీసర్వే పనులు పారదర్శకంగా చేశామన్నారు. ఇందుకుగాను మండలంలోని కనమర్లపూడి, పిచికలపాలెం, వేల్పూరు, పోట్లూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే పనులు నూరు శాతం పూర్తి అయినట్లు చెప్పారు. శానంపూడి రెవెన్యూ గ్రామపరిధిలో భూముల కొలతలు పూర్తయ్యాయని, ప్రస్తుతం రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని కారుమంచి, కొత్తలూరు రెవెన్యూ గ్రామాల్లో ఓఆర్ఎస్ ఛాయాచిత్రాలు రాగానే రీసర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు డెప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట భాస్కర్, ఆర్ఐలు పి.నాసరయ్య, చంద్రబాబులు ఉన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో అద్దంకమ్మ, పోలేరమ్మ అమ్మవారికి బోనాల వేడుకలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వేడుకలు గ్రామస్తులు ఐక్యంగా చేయటం ఆనావాయితీగా వస్తుంది. ఈసారి వర్షాలు పడాలని కోరుకుంటు ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపురవీధుల్లో కనకతప్పెట్లు, మేళాతాళాల నడుము ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారి సన్నిధిలో పొంగళ్ళు పొంగించి, నూతన వస్త్రాలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది,

జోరుగా మిరపనాట్లు



అమరావతి : మిరపనారు ఏపుగా పెరగడంతో మండల పరిధి గ్రామాల్లో గత నాలుగు రోజు లుగా రైతులు జోరుగా మిరపనాట్లు సాగిస్తున్నారు. నారుమళ్లలో పెరిగిన మిరపనారును చేలల్లో నాటే సమయం ఆసన్నమవడంతో మి రపనాట్లు నాటుతున్నారు. గత నాలుగు రోజు లుగా మండల పరిదిలోని అన్ని గ్రామాల్లో అక్కడక్కడ వర్షం పడడంతో రైతులు మిరపనాట్లు ప్రారంభించారు. మిరపనాట్లకు పెద్ద ఎత్తున కూలీలు అవసరమవడంతో రైతులు పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకుని వచ్చి నాట్లు సాగిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో రైతులు గతేడాది ముడత తెగులు వల్ల నష్టపోవడంతో మిర్చి పంట తక్కువగా సాగుచేస్తున్నారు. గతేడాది మండలంలో నాలుగువేల ఎకరాల్లో మిర్చి పంట సాగుచేస్తే ఈఏడాది మూడువేల ఎకరాల్లో సాగుఅవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధరఉండడంతో రైతులకు ఉపశమనంగా ఉంది.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



75త్యాళ్లూరు(పెదకూరపాడు): ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపల్ నందమూరి శిరీషా తెలిపారు. ఆదివారం మండలంలోని 75 త్యాళ్లూరు వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ ఆవరణలో ఎంజె నాయుడు(ఆర్థో,కీళ్ల) సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి విజయవాడ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆసుపత్రి గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్ సారథ్యంలో స్పెషలిస్టు డాక్టర్ ఎంజెనాయుడు, డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ జ్యోతి డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.500 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్లు ఆసుపత్రి కోఆర్డినేటర్ తెలియజేశారు. కార్యక్రమంలో వీరబాబు, పి.రాఘవరాజు, స్థానిక నాయకులు హనిమిరెడ్డి, సాంబిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎస్ఐ మణికృష్ణ

అచ్చంపేట: ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమతులు లేని ఎందరో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, అలాంటివారిని స్నేహహస్తాలు ఫౌండేషన్ చేరదీసి వారి విద్యాభివృద్ధికి కావలసిన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ అన్నారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన జెట్టి పూజిత ప్రాజెక్టువర్క్‌కు అవసరమయ్యే ల్యాప్‌టాప్‌ను ఆదివారం అచ్చంపేటలో ఎస్ఐ మణికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రాజెక్టువర్క్‌కు కావలసిన ల్యాబ్‌టాప్ కొనిపెట్టే ఆర్థిక స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు రూ.35000 విలువచేసే ల్యాప్‌టాప్ అందచేయడం హర్షణీయమన్నారు. విద్యాభివృద్ధికి వారు చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. ప్రతిభకు విద్య తోడైతే వారి భవిష్యత్ ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మన్నెం భద్రయ్య, కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, కానిస్టేబుల్ సత్తిరాజు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి కమిటి చైర్మన్ తుమ్మా శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహన చట్ట సవరణతో రవాణా సిబ్బందిపై పెనుభారం

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాహన చట్ట సవరణతో మోటార్ వాహనాల డ్రైవర్ల పై భారం మోపాయని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శివాజీ అన్నారు. చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పట్టణ మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎస్ సైదేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని, ఇన్స్యూరెన్స్ ప్రీమియం విపరీతంగా పెంచారని, రూ. 200 ఉన్న గ్రీన్ టాక్స్ రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోడ్ టాక్స్ 30 శాతం పెంచారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని, చిన్న చిన్న పొరపాట్ల కు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా ఎం హరి పోతురాజు, అధ్యక్షులుగా నాలి రాజేంద్ర, కార్యదర్శిగా ఎ.వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా పోలయ్యతో కలిపి 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

తిమ్మాపురంలో త్రైత సిద్ధాంతం ప్రచారం

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగద్గీత గ్రంథాలను ప్రచారం చేయడం జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినం యొక్క అష్టమి తిథి జన్మరహస్యాన్ని తెలుసుకుంటే జ్ఞాన, అజ్ఞానాల వ్యత్యాసాలు తెలుస్తాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీతలోని పరమార్థాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత -ప్రబోధ సేవాసమితి, పిడుగురాళ్లకు చెందిన ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు కె.అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపీ, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, శివ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31న సాయంత్రం 4.00 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. సమావేశానికి ఎక్స్‌అఫిషీయోగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు హాజరుకానున్నట్లు తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధి పథం.. సంక్షేమ రథం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో మండలంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు
- 38,456 మంది లబ్ధిదారులకు రూ.88.04 కోట్ల లబ్ధి
- రూ. 40 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్నున్న ప్రజలు



పోట్లూరులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణ పనుల్లో శీతల గిడ్డంగి భవనం

శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి పథాన పయనిస్తూ.. సంక్షేమ రంగంలో పరుగులు తీస్తోంది. ఏ ఒక్కరికీ ఆగకుండా, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గత టీడీపీ పాలనలో జరగనటువంటి అభివృద్ధి పనులు చేసి చూపిస్తూ ప్రజల మనస్సులో స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయడు సుస్థిర స్థానం ఏర్పరుచుకున్నారు. ఆయన సారధ్యంలో అధికారుల సమక్షంలో మండలంలో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో జగ్గా ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేశారు. అలాగే ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రూ.లక్ష విలువ చేసే గ్రామ సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్ భవనాల సముదాయాలతో ప్రజలకు ముంగిటికి మెరుగైన పాలన వచ్చింది. మండలంలోని కనమర్లపూడి, పిచికలపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో రైతులకు పొలాలకు వెళ్లటానికి అనుకూలంగా ఉండే ఒక్కో వంతెన రూ.30 లక్షల వ్యయంతో పనులు పూర్తి చేశారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ. 6 కోట్లు వ్యయంతో శీతల గిడ్డంగి కేంద్రం, రూ.4కోట్లు వ్యయంతో నూతన విద్యుత్ సబ్ స్టేషను పనులు కూడా జరుగుతున్నాయి. శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల్లో బాలికల జూనియర్ కళాశాలలో విద్య బోధన జరుగుతోంది. అలాగే రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచేందుకు లక్షల వ్యయంతో గోదాం నిర్మాణ పనులు కొత్తలూరు, వేల్పూరు, మతుకుమల్లి, పోట్లూరు, గుంటుపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్నాయి. శావల్యాపురంలో రైల్వే స్టేషను వెళ్లు రహదారి మార్గంలో సీసీ డ్రైన్స్, పాటు ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డు పనులు జరిగాయి.

అర్హులందరికీ సంక్షేమం..



అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలు కులమతాలకు అతీతంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించటమే ప్రభుత్వ ధ్యేయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల సుపరిపాలనలో, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారధ్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరగడంతో పాటు సంక్షేమ ఫలాలు పేదలకు పారదర్శకంగా అందుతున్నాయి.

– ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఎంపీపీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..



అర్హత ఉన్న పేదలందరికీ సంక్షేమ పథకాలు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివి. పేదల అభ్యున్నతికి నిరంతరం ప్రభుత్వం పథకాల రూపంలో సంక్షేమాన్ని అందిస్తోంది.

– పేరుమీనా సీతారామయ్య, ఎంపీడీఓ

నేటి నుంచి పాడిరైతులకు రుణమేళా

శావల్యాపురంః జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అమూల్ పాల కేంద్రాల్లో పాల ఉత్పత్తిదారులకు రుణామేళా కార్యక్రమం జరుగుతుందని ఏంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. అమూల్ పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ ఒక్కో పాడిరైతుకు సొసైటీ బ్యాంకు తరపున రూ. 1.60లక్షలు రుణ సదుపాయం 7శాతం వడ్డీరేటుకు కల్పిస్తామన్నారు. రుణామేళా కార్యక్రమంలో మొదట రోజు వేల్పూరు-1, వేల్పూరు-2, పోట్లూరు గ్రామసచివాలయాల్లో, రెండవరోజు 29న శావల్యాపురం, కనమర్లపూడి, 30న గుంటుపాలెం, పిచికలపాలెం, 31న శానంపూడి, బొందిలిపాలెం, సెప్టెంబర్ 1వ తేదీన మతుకుమల్లి, కారుమంచి, 2న చినకంచర్ల గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువ రైతుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాలు అధికారులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమక్షంలో జరుగుతాయన్నారు. ఈరుణామేళా కార్యక్రమంలో పాల్గొనే రైతులు సొసైటీ బ్యాంకుఖాతా కల్గియుండాలని, ఆధార్, రూ. 100 నోటరీ ధ్రువీకరణ పత్రాలను రుణామేళా కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అందజేయాలన్నారు. పాడి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవనోపాదులు పెంపుదల చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మాచవరం: పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌నకు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యామర్తి హనుమయ్య (38) ఇటీవల సాగునీరు నిమిత్తం తన సొంత పొలంలో బోరుబావికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం పొలం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌నకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు.

29న సరస్వతి శిశుమందిర్‌లో అష్టావధానం

సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఈనెల 29న సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో అష్టావధానం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. అవగాహన సుధాకర, స్వర్ణకంకణ గ్రహీత, శతావధాని శ్రీమాన్ నారాయణ బాలసుబ్రమణ్యం హాజరవుతారన్నారు.

నేడు, రేపు జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా

సత్తెనపల్లి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28, 29న జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా పడినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తిరిగి ఈనెల 30, 31న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు యధావిధిగా జరుగుతాయన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఆదర్శ పాఠశాల విద్యార్థినుల కిట్

కారెంపూడి: పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి యూనిసెఫ్ గ్రాండ్ ఫినాలేకు స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థినులు రూపొందిన కిట్ ఎంపికైంది. పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు స్వాతి, మహాలక్ష్మి, సుమతి, శాంతిల బృందం రూపొందించిన 'హీట్ ప్రొటెక్టింగ్ కోట్ అండ్ హాట్ కిట్' రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఎండలో పనిచేసే కార్మికులు, రైతులు ఇతరులు ఈ కోట్ ధరించడం ద్వారా ఎండి వేడి నుంచి ఉపశమనం కలిగే విధంగా విద్యార్థినులు దీనిని రూపొందించారు. ఒక కోట్, హాట్ మాస్క్, ఒక జత గ్లౌస్‌లు ఇతర అందుబాటులో ఉండే వస్తువులతో విద్యార్థిను లు దీనిని రూపొందించారు. కేవలం రూ.400 ఖర్చు చేసి విద్యార్థినులు ఈ కిట్ తయారు చేశారు. ఈ నెల 28 నుంచి 3 రోజుల పాటు విజయవాడలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో వారు రూపొందించిన కిట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రిన్సిపల్ నయోమి ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న లక్ష్మి మార్గదర్శకంలో ఈ కిట్‌ను విద్యార్థినులు రూపొందించారు. వారు రూపొందించిన ప్రత్యేక కోట్, హ్యాట్ ధరిస్తే ఎండ తీవ్రత నుంచి రక్షణ పొంద వచ్చని తెలియజేస్తున్నారు.